
క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకిసేవ వైభవంగా జరిగింది. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం మనుబోలు మండలం గొట్లపాళెం భక్తులచే కోలాటం ప్రదర్శించారు.

వెంకయ్యస్వామికి..



మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు ముందుగా వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. నెల్లూరు చిన్నబజార్‌కు చెందిన మక్కం రత్నంశెట్టి ఉభయకర్తగా వ్యవహరించారు.

సన్మానం



పొదలకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఏడేళ్ల పాటు పనిచేసిన ఎస్.సుబ్రహ్మణ్యం జెడ్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను అధికారులు కొనియాడారు. ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, ప్రత్యేకాధికారి శోభన్‌బాబు, ఏఈలు శివమోహన్, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



పొదలకూరు : స్వర్ణాంధ్ర 2047 సాధనపై స్థానిక డీఎన్నార్ జెడ్పీహైస్కూల్లో మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ పోటీలను శనివారం నిర్వహించారు. ఎంఈఓ కె.రేణుక పోటీలను పరిశీలించి, మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్ఎం సనత్‌కుమార్, ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్ పాల్గొన్నారు.

రగ్బీ జిల్లా జట్టుకు గండవరం విద్యార్థులు



కొడవలూరు : మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు రగ్బీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర జిల్లా జట్టుకు నలుగురు, అండర్-17 బాలుర జట్టుకు ఒకరు ఎంపికయ్యారు. పి.జోయల్, టి.చరణ్, సీహెచ్.జితేంద్ర, కె.నిషాంత్‌లు అండర్-14 జట్టుకు ఎంపికవ్వగా, సీహెచ్.మోక్షజ్ఞ అండర్-17 జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఆ పాఠశాలలో హెచ్ఎం జి.శ్రీనివాసరావు, పీడీ సీహెచ్.శివనాగబాబు శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

జగదేవిపేట పీహెచ్‌సీ పరిశీలన



ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి సందర్శించారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో వసతులపై ఆరా తీశారు. అనంతరం నాగరాజుతోపులో 104 ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. అక్కడికి వచ్చిన గర్భిణుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ సుధాకర్‌రావు, అశోక్, హెల్త్ సూపర్‌వైజర్ రమా, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ హైమావతి, హెల్త్ అసిస్టెంట్ మాధవ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామీ.. బాబుకు సద్బుద్ధి ప్రసాదించు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఆలయాల్లో ప్రాయశ్చిత్త పూజలు



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సీఎం చంద్రబాబుకు వెంకటేశ్వరస్వామి మంచి సద్బుద్ధి ప్రసాదించాలని, కల్తీ నెయ్యి అంటూ ఆయన చేసిన దుష్ప్రచారానికి ప్రాయశ్చిత్తంగా తాము స్వామికి ప్రత్యేకపూజలు చేస్తున్నామని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కాకాణి పొదలకూరులోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రాయశ్చిత్త పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అసత్య ప్రచారంతో హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నట్లు పేర్కొన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించలేదని దేవస్థానం ఈఓ శ్యామలరావు చెప్పారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాన్య భక్తుడిగా తిరుమలకు వెళ్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు చేస్తున్న పాపాలకు భవిష్యత్తులో శిక్ష అనుభవించక తప్పదన్నారు. నెయ్యి పరీక్షల కోసం గుజరాత్‌కు పంపడంలో ఏదో కుట్రదాగి ఉందనే అనుమానాలు ఉన్నట్లు తెలిపారు. తండ్రిలాంటి ఎన్టీయార్‌కు వెన్నుపోటు పొడిచిన బాబు తన క్షుద్ర రాజకీయాల కోసం కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని వాడుకుంటున్నట్లు విమర్శించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే సిట్ కాకుండా కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ సీబీఐ ద్వారా విచారణ చేయించాల్సిందిగా డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్, ఈఓ శ్యామలరావు, మంత్రి లోకేశ్ పొంతన లేకుండా నెయ్యి కల్తీపై మాట్లాడుతున్నట్లు చెప్పారు. తిరస్కరించిన శాంపిళ్లను సాధారణంగా మైసూరులోని నేషనల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు పరీక్షల కోసం పంపుతారని, గుజరాత్‌లోని డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు పంపడంపై భక్తుల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో పేరున్న చంద్రబాబు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్‌పై రాద్ధాంతం చేయించి ఆయనను తిరుమలకు వెళ్లి నోటీసులు అందజేసి అడ్డుకున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో నాయకులు గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, కోనం బ్రహ్మయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, తెనాలి నిర్మలమ్మ, లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, వి.గోపాల్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఆదూరు వెంకటసుబ్బయ్య, వెంకురెడ్డి, కృష్ణంనాయుడు, అంజాద్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు గ్రామంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రాయశ్చిత్త పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య యాదవ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం ఎంతో పవిత్రమైన టీటీడీ వెంకటేశ్వరస్వామిని వాడుకోవడం దురదృష్టకరమన్నారు. సీఎం హోదాలో ఐదేళ్లు వెంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమలకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, సర్పంచ్ కడివేటి శివ, ఉప సర్పంచ్ బాబర్, పార్టీ నాయకులు మందల పెంచలయ్య, చీకుర్తి నరసయ్య, గుర్రం పుట్టయ్య, నరేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవుడితో రాజకీయాలు తగదు

తోటపల్లిగూడూరు : చంద్రబాబూ.. దేవుడితో రాజకీయాలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోట్లపూడి గ్రామ శివాలయంలో శనివారం ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమల ఏడుకొండల స్వామి ఆలయ పవిత్రతను అపహాస్యం చేస్తూ అధికార పార్టీ నేతలు కుయుక్తులు పన్నడం దుర్మార్గమన్నారు. దేవుడితో రాజకీయాలు చేస్తున్న సీఎం చంద్రబాబుకు వెంకటేశ్వరస్వామి మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిల్లకూరు ప్రసూనమ్మ, వైస్ ఎంపీపీ చెరుకూరు శీనయ్య, ప్రసన్నకుమార్‌రెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : పోట్లపూడి శివాలయంలో పూజలు చేస్తున్న పార్టీ నేతలు

కోవెరపాళెంలో..

స్థానిక కోవెరపాళెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నేత మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన టీటీడీకి చెడ్డ పేరు తేవడానికి అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రచారం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం చిరంజీవులుగౌడ్, పార్టీ నేతలు తిరువళ్లూరు ఈశ్వరయ్య, రాయపు శీనయ్య, ఎంబేటి సంధ్యారాణి, కాయల మణి, ప్రవీణ్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై దృష్టి మరల్చేందుకే..

మనుబోలు : ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం చంద్రబాబు కల్తీ నెయ్యి వివాదాన్ని రాజేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి విమర్శించారు. మనుబోలు విష్ణాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన శనివారం ప్రాయశ్చిత్త పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో సీఎం చంద్రబాబు, అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్న తీరు క్షమార్హం కాదన్నారు. తన దుష్ట రాజకీయాల కోసం తిరుమల క్షేత్రాన్ని కూడా వాడుకోవడం సీఎం చంద్రబాబు దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. అనంతరం పార్టీ నేతలు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ మాట్లాడారు. నాయకులు ఏలూరు భాస్కర్‌రెడ్డి, చల్లా నవకోటి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, చలగల దయాకర్, కోసూరు కోటేశ్వరగౌడ్, దేసిరెడ్డి హరనాథ్‌రెడ్డి, కంచి మణి, దుగ్గన వేణుగోపాల్, నాగమణి పాల్గొన్నారు.

సీబీఐ విచారణ జరిపించాలి



కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ముత్తుకూరు : తిరుమల లడ్డూ వివాదంపై వాస్తవాలు వెలుగు చూడాలంటే సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ముత్తుకూరు మండలం, లక్ష్మీనరసాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, ఎంపీపీ గండవరం సుగుణ తదితరులు మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన సిట్ వల్ల నిజాలు వెలుగు చూడవన్నారు. పవిత్రమైన లడ్డూలో కల్తీ అంటూ దుష్ప్రచారం చేసిన చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, వల్లూరు సర్పంచ్ పెంచలప్రతాప్, పార్టీ నేతలు గండవరం సూరి, షేక్ మస్తాన్, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: కసుమూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



తోటపల్లిగూడూరు : కోవెరపాళెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



మనుబోలు: విష్ణాలయంలో పూజలు చేస్తున్న నాయకులు

పాతకక్షలతో ఇరువర్గాల దాడి

- కేసు నమోదు

విడవలూరు : పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మండలంలోని రామతీర్థం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కథనం మేరకు.. మండలంలోని రామతీర్థం గ్రామంలో గత జూలై నెలలో జరిగిన ఉత్సవాల్లో అదే గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. సెప్టెంబర్ 27న శుక్రవారం రాత్రి వారి మధ్య మాటా మాటా పెరిగి మళ్లీ గొడవకు దారితీసింది. ఇందులో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా నాశిన రామకృష్ణ అనే వ్యక్తి తనపై రామతీర్థం గ్రామానికి చెందిన సుబ్బారావు, నరేంద్ర, వెంకయ్య, శీనయ్య, రాజా, మల్లికార్జున, రవి దాడి చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. అయితే మరో వర్గానికి చెందిన ఎల్లశ్రీ వెంకటేశ్వర్లు తమపై కూడా దాడి జరిగిందని రామకృష్ణ, లక్ష్మయ్య, ఉదయ్, వెంకటేశ్వర్లు, శేషమ్మపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులపై ఎస్సై నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి, ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు సుమంత్



సుమంత్

మనుబోలు : మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్(ఎంపీసీ) చదువుతున్న సుమంత్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ వేణుగోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన అండర్-19 స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో సుమంత్ మొదటి స్థానం సాధించి అంతర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుమంత్‌ను కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు, పీడీ అభినందించారు.

రామన్నపాళెంలో పారిశుద్ధ్య పనులు



కొడవలూరు : మండలంలోని రామన్నపాళెంలో సర్పంచ్ కె.ధనమ్మ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పూడిక తీయడంతో పాటు చెత్తా చెదారాలను డంపింగ్ యార్డ్‌కు తరలించారు. అన్ని వీధుల్లో బ్లీచింగ్ వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, స్థానిక నాయకుడు కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలి



మొక్క నాటుతున్న సీఈఓ జగదీష్ పటేల్

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి పెంచాలని అదానీ కృష్ణపట్నంపోర్టు సీఈఓ జగదీష్ పటేల్ పిలుపునిచ్చారు. పోర్టులో శనివారం జరిగిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. ఇందుకోసం పోర్టులో ఒక విభాగం పనిచేస్తోందన్నారు. అనంతరం పోర్టులో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి, వ్యర్థాలను తొలగించారు. సీఓఓ రాజన్‌బాబు, ఈహెచ్ఎస్ మేనేజర్ బొల్లా శ్రీను, వెంకటేష్‌భాస్కరన్, మృత్యుంజయరామ్, గంగా సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



మనుబోలు : విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

మనుబోలు : మహిళల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని బద్దెవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను నివారించవచ్చని అన్నారు. గుడ్లు, తృణధాన్యాలు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చందన, సూపర్‌వైజర్లు రమణమ్మ, ఆదినారాయణమ్మ, అంగన్‌వాడీలు రాధా, దొరసానమ్మ, ఉమ, వెంకటరమణమ్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

పొదలకూరు : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ప్రతినెలా 10వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు పరిశీలించుకోవాల్సిందిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పార్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో సూపర్‌వైజర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు ప్రసూన్న, బుజ్జమ్మ, జ్ఞానేశ్వరీ, సరస్వతీ, శ్రీదేవి, పెంచలమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

కొడవలూరు : పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి కోరారు. మండలంలోని యల్లాయపాళెంలో గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహారంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలున్న చిరు ధాన్యాలు, ఆకు కూరలు, పాలు, గుడ్లు, పండ్లను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఐ.సుఖవేణి, జ్యోత్స్న పాల్గొన్నారు.



పొదలకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్



కొడవలూరు: యల్లాయపాళెంలో..

‘డీఎన్నార్’లో స్వచ్ఛత హీ సేవ



పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో కండలేరు డ్యామ్ కామాక్షి మహిళా మండలి వారు శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని చెత్తా చెదారాన్ని విద్యార్థులతో కలిసి తొలగించారు. కార్యక్రమంలో ఎంఈఓ రేణుక, డ్వామా డిప్యూటీ డైరెక్టర్ శంకర్, హెచ్ఎం సనత్‌కుమార్, మహిళా మండలి అధ్యక్షురాలు పి.రమణమ్మ, నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు మైథిలి, శోభన్‌బాబు, హరీష్, ఉపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి

విడవలూరు : స్థానిక పీఆర్ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధునిక తెలుగు కవి గుర్రం జాషువా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత మాట్లాడుతూ నవయుగానికి జాషువా కవిత్వం మార్గదర్శకత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.మధు, జి.పద్మప్రియ, డాక్టర్ ఈశ్వర్, వి.శ్రీరామమూర్తి, ఎం.వెంకటరమణరావు, పి.ప్రియాంక, విద్యుల్లత పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

పొదలకూరు : డయేరియా వ్యాధి ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీని ఆయన శనివారం పరిశీలించి డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. క్షయ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. అనంతరం టీబీ యూనిట్, డీఎంసీను పరిశీలించారు. సీహెచ్‌సీ సూపరింటిండెంట్ యు.ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

- మెప్మా పీడీ రవీంద్ర

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పేదల ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మెప్మా పీడీ రవీంద్ర మండలాధికారులను ఆదేశించారు. మండలంలోని రేబాల గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో శనివారం జరిగిన ‘మన ఇల్లు–మన గౌరవం’ కార్యక్రమంలో మెప్మా పీడీ పాల్గొని, మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు పాదుపులో ఉన్న వారికి మెప్మా తరపున రుణాలు అందిస్తామని తెలిపారు. ఎంపీడీఓ నరసింహారావు, ఎంపీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మార్చి నాటికి పూర్తి చేసుకోవాలి

కొడవలూరు : వచ్చే మార్చి ఆఖరులోగా ప్రభుత్వ పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారిని పి.సత్యవాణి సూచించారు. కొడవలూరు దర్గా సంఘంలోని లేఅవుట్ లబ్ధిదారులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ నుంచి సహకారం అందుతుందని, సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నగదు సమస్యతో ఆగిన గృహ నిర్మాణాలకు బ్యాంకర్ల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ మాధవయ్య, ఏఓ లక్ష్మి, ఇంజినీరింగ్ సహాయకులు శ్రీకాంత్, బాలకృష్ణ, హౌసింగ్ డీఈఓ సునీత పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లను పూర్తి చేస్తాం

మనుబోలు : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్లను లబ్ధిదారులు, అధికారుల సహకారంతో పూర్తి చేస్తామని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మనుబోలులోని జగనన్న కాలనీలో ‘మన ఇల్లు మన గౌరవం’ కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు పూర్తయి బిల్లులు రాని వారు, బిల్లులు రాక అసంపూర్తిగా ఆపేసిన నిర్మాణాలను వారు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే బిల్లులు మంజూరు చేయిస్తామని తెలిపారు. 2025 మార్చి లోపు ఇళ్లు నిర్మించుకోని వారికి ఆపై బిల్లులు మంజూరు చేయడం కదరదన్నారు. అనంతరం కాగితాలపూరులోని జగనన్న కాలనీలో నిర్మించిన పక్కా గృహాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ నేతలు రామిరెడ్డి, చిట్టిబాబు ఉన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ దయాకర్‌రావు

వెంకటాచలం : వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రముఖ వైద్యుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ దయాకర్‌రావు పలు సూచనలు చేశారు. విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే వృత్తి విద్యా నైపుణ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ టి.వరప్రసాద్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం : విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో నారాయణ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. చిన్న సమస్యలు పెద్దవిగా మారకముందే పరిష్కరించుకుంటే ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయడం వల్ల చదువుపై దృష్టి సారించడం కష్టమవుతోందని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, తదితరులు పాల్గొన్నారు.